‘ఆగిపోయావేం......త్వరగా కిందికి దిగు’ అన్నాడు శ్రీరామ్.

‘దిగిపోతేనో?’ రాంబాబు అడిగాడు.

‘మేమే నీ దగ్గరికి పరుగెత్తుకు వచ్చి అరెస్టు చేయాల్సి ఉంటుంది......’

‘ఎందుకూ?’

‘నీలిమని నువ్వు హత్య చేశావు కాబట్టి!’

‘ఏమిటి మీకు రుజువు?’

‘నీలిమని కౌగిలించుకుని ఉన్నట్టు ఉన్న నీ ఫోటో!’

‘ఆ ఫోటో మీకెక్కడిదీ?’

‘నేను ఇచ్చాను’ గర్వంగా అన్నాడు నాగరాజు.

రాంబాబుకి పరిస్థితి పూర్తిగా అర్థం అయింది. ఇప్పుడు తనేమి చెప్పినా వాళ్ళు వినరు. తీసెక్కెళ్ళి లాకప్‌లో పారేసి గొడ్డుని బాదినట్టు బాదిచేయని హత్యచేసానని ఒప్పుకొనేలా చేస్తారు.

కిష్టయ్య, సరోజ వాళ్ళందరి వెనకా నిలబడి రాంబాబుని పారిపొమ్మన్నట్టుగా సైగచేసారు.

ఇక క్షణం ఆలస్యం చేయదల్చుకోలేదు రాంబాబు.

గిరుక్కున వెనక్కి తిరిగి కొండమీదికి పరిగెత్తడం మొదలుబెట్టాడు.

‘పారిపోతున్నాడు.... పట్టుకోండి ..... షూట్ చెయ్యండి.....’ శ్రీరామ్ పడ్తులేస్తూ కొండెక్కుతూ అన్నాడు.

‘సార్.....మీ దగ్గర రివాల్వర్ ఉందిగా ....దాంతో అతని కాళ్ళమీద షుట్ చెయ్యండిసార్.....’ అన్నాడు నూటపదకొండు.

‘దాంట్లో బుల్లెట్స్ లేవు.....లేకపోతే ఇంతదాకా ఊరుకునే వాడ్నా..... అయినా నాకే సలహాలు ఇచ్చేంతవాడిని అయ్యావా?.....షూట్ చేస్తాను జాగ్రత్త!.....’

‘కానీ మీ పిస్తోల్లో బుల్లెట్లు లేవు కద్సార్?’

శ్రీరామ్ నాలుక కొరుక్కున్నాడు.

‘సర్లె సర్లె....కాస్త పరుగు వేగం పెంచండి..... ఎలాగైనా సరే మనం అతన్ని పట్టుకోవాలి!’

రాంబాబు మళ్ళీ కొండ అంచుమీదికి చేరుకుని ఆ అంచు వెంబడి కాస్త దూరం పరుగెత్తాడు...అలా కాస్సేపు పరుగెత్తి తరువాత స్లోపువచ్చింది. అక్కడి నుండి కిందికి వేగంగా పరుగెత్తాడు. ఒక పావుగంట పరుగెత్తిన తరువాత కొండ కిందికి వచ్చేసాడు. రాంబాబు కొండకిందికి వచ్చే సరికి శ్రీరామ్ బృందం ఆపసోపాలు పడుతూ కొండ అంచుమీదికి చేరుకున్నారు. వాళ్ళందరికి రాంబాబు కొండక్రింద మట్టిరోడ్డు మీద పరుగు చేయడం కనిపించింది.

బాబు అదృష్టం బాగుండి అతనికి ఎదురుగా ఓ లారీ వచ్చింది. రాంబాబు లారీకి

ఎదురుగా వెళ్ళిచెయ్యి ఊపి లారీని ఆపాడు.

'ఊళ్లోకేగా వెళ్ళేది?' రాంబాబు ఆయాసపడ్తు అన్నాడు? ఎక్కడి నుండి పరుగెత్తుకు వస్తున్నారు? ఏం చేసి వస్తున్నారు?' అనుమానంగా చూస్తూ అడిగాడు లారీ డ్రైవర్.

'పరుగెత్తడం కాదూ పాడు కాదు...నాకు ఉబ్బసరోగం ఉంది...... అందుకే ఆయాసం' అలా అంటూ లారీడ్రైవర్ అనుమతికోసం ఎదురు చూడకుండా లారీ ఎక్కాడు రాంబాబు.

లారీ దుమ్ము రేపుకుంటూ ముందుకు కదిలింది.

కొండ అంచు ఉన్న శ్రీరామ్ బృందం హాహా కారాలు చేసారు.

### *ఇంకా ఇరుక్కున్నాడు*

'కాస్త నవ్వండి.....'

కెమెరా లెన్స్ అడ్జెస్టు చేస్కుంటూ అన్నాడు శ్యామల్రావు.

ఆమె కాస్త నవ్వింది.

'ఇంకాస్త నవ్వాలి.....' వ్యూ ఫైండర్‌లోంచి చూస్తూ అన్నాడు శ్యామల్రావు.

కాని ఆమె నవ్వలేదు గానీ ముఖంమీద వున్న కాస్త చిరునవ్వు కూడా ఎగిరిపోయింది.

'నవ్వాలండీ.......' విసుగుదలని అణచుకుంటూ అన్నాడు శ్యామల్రావు గిరుక్కున వెనక్కి తిరిగాడు.

ఆమె కళ్ళు పెద్దవిచేసి చూస్తూ బిగుసుకుపోయింది. ఉన్నట్టుండి కెవ్వుమని అరిచింది.

'ఏమైంది?' కంగారుపడ్తూ అడిగాడు శ్యామల్రావు.

'దొంగ.....దొంగ .....' వణుకుతూ అంది ఆమె. శ్యామల్రావు గిరుక్కున వెనక్కి తిరిగాడు.

పీక్కుపోయిన మొహంతో రేగిన జుట్టుతో నలిగిన నల్లని బట్టల్లో దుమ్ముకొట్టుకుపోయి ఉన్నాడు రాంబాబు!

'దొంగా కాదు.....వీడు నాస్నేహితుడు......' బిగుసుకుపోయిన ఆ అమ్మాయితో అని 'ఏంటిఈ వాలకం...... మళ్ళీ నీ స్టూడియోని ఎవరైనా ఎటాక్‌చేశారా?.... అయినా ఇప్పుడు ఫోటోలు బాగానే తీస్తున్నట్టున్నావుగా?' అన్నాడు శ్యామల్రావు.

'అటువంటిదేమీ కాదు..... అంతకంటే చాలాసీరియల్ మేటర్!......నీతో అర్జంటుగా మాట్లాడాలి ..... మీ ఇంటి కెళ్దాం రా.....'

'ఉండు......ఈమె ఫోటో తీసి పంపించేసి మాట్లాడుకుందాం.....'

శ్యామల్రావు ఆమె ఫోటో తీసి పంపిచేసాడు.

'చెప్పు......ఏంటీ?' అన్నాడు శ్యామల్రావు రాంబాబు వంక చూస్తూ.

'ఇంటికెళ్దాం ......' అన్నాడు రాంబాబు.

'ఇక్కడ చెప్పకూడదా?'

'ఇంకాస్సేపు ఈ బజార్లో నేను తిరుగుతే పోలీసులు నన్ను అరెస్టు చేస్తారు'

శ్యామల్రావు ఆశ్చర్యంగా రాంబాబు వంక చూశాడు.

'ప్లీజ్....... ఆలస్యం చెయ్యక త్వరగా పద. అన్ని వివరాలూ నీకు ఇంటి దగ్గర చెప్తాను' భయం భయంగా బయటికి చూస్తూ అన్నాడు రాంబాబు.

'సరే పద.....'

స్టూడియోని తన అసిస్టెంట్లకి అప్పజెప్పి రాంబాబుని ఇంటికి తీస్కెళ్ళాడు శ్యామ్రావు.

శ్యామ్రావు భార్య జయంతి కాఫీ కలిపి తెచ్చింది.

'బాగున్నారా రాంబాబుగారూ' అంది జయంతి నవ్వుతూ.

'ఏమోనండీ...... అదే తెలీడంలేదు.....' అంటూ కాఫీ కప్పు అందుకున్నాడు.

జయంతి ఒసారి వింతగా అతనివంక చూసి వంట గదిలోకి వెళ్ళి పోయింది.

ఇద్దరూ కాఫీ తాగారు.

'ఇప్పుడు చెప్పు!' అన్నాడు శ్యామ్రావు.

రాంబాబు జరిగిన సంగతంతా వివరంగా చెప్పి ఊపిరి తీసుకున్నాడు.

'అరెరె......ఎంతపని జరిగింది?' శ్యామ్రావు జాలిపడ్డాడు.

'కాబట్టి నీ కోసం పోలీసులు వెతుకుతుంటారు. నాఇంటిమీద నిఘాఉంటుంది. తాడేపల్లిగూడెంలో కూడా నా ఇంటిమీద నిఘా ఉంటుంది. నువ్వు నాకు స్నేహితుడివని కిష్టయ్యకి, సరోజకి తప్ప వేరే ఎవరికీ తెలీదు! మీ ఇంట్లో నాకు సేఫ్గా వుంటుంది. కొన్నాళ్ళు మీ ఇంట్లో తలదాచుకోనియ్......' దీనంగా అడిగాడు రాంబాబు.

సరేనన్నాడు శ్యామ్రావు. రాంబాబుకి ధైర్యంచెప్పి ఇంట్లోంచి కదలకు అని సలహా ఇచ్చి తను మళ్ళీ స్టూడియోకి వెళ్ళిపోయాడు.

సాయంత్రం అయ్యేసరికి సరోజ, కిష్టయ్య శ్యామ్రావు ఇంటికి వచ్చారు. వాళ్ళని చూస్తూనే రాంబాబు ఆశ్చర్యపోయాడు.

'నేనిక్కడ ఉన్నానని మీ కెవరు చెప్పారు?'

'ఇందాక బజారులో శ్యామ్రావుగారు కనిపించి చెప్పారు.......' అంది సరోజ.

'గురూగారూ.... కొంప మునిగిపోయిందండీ ..... హత్య మీరే చేశారనడానికి పోలీసులకి మరో బలమైన సాక్ష్యం దొరికిందండీ.....'

'ఏంటది?.....' రాంబాబు కంగారుగా అడిగాడు.

'పోలీసులు మన ఇంటిని సోదాచేసారు గురూగారూ..... వాళ్లకి డైమండ్ నక్లెస్ దొరికింది గురూగరూ......'

'అయితే?'

'ఆ నక్లెస్ నీలిమది అంట!'

రాంబాబు తల పట్టుకున్నాడు.

సరోజ, కిష్టయ్య రాంబాబువంక జాలిగా చూశారు.

'అయిపోయింది...... అంతా అయిపోయింది...... నాకు ఉరిశిక్ష ఖాయం.....' రాంబాబు దీనంగా అన్నడు.

'మీరేమీ బాధపడకండి గురూగారు..... అన్యాయం ఎప్పటికి గెలవదు. నిజానిజాలు తెలిసి చివరికి న్యాయమే గెలుస్తుంది..... అన్యాయం న్యాయం చేతిలో చిత్తు చిత్తుగా ఓడిపోతుంది......' అన్నాడు కిష్టయ్య ఆవేశంగా.

రాంబాబు చికాకుగా కిష్టయ్య వంక చూశాడు.

'ఎప్పుడు?..... నేను ఉరి తీయబడ్డాకా?..... నువ్వు కాస్త తెలుగు సినిమాలు చూడ్డం తగ్గించు......'

'అసలు నీలిమ డైమండ్ నెక్లెస్ నీదగ్గరికెలా వచ్చింది రాంబాబు?' సరోజ అడిగింది.

'కిష్టయ్య నీకు చెప్పలేదు గురూగారూ'

రాంబాబు..... వీరూ దగ్గర ఆ నగ దొరికింది కాబట్టి వీరూ ఆహత్య చేసి ఉండొచ్చుగా?

రాంబాబు మొహం సంతోషంతో విప్పారింది.

'కరెక్ట్ సరోజ?..... వాడు దొంగతనానికి నీలిమ యింటికి వెళ్ళి వుంటాడు. అప్పుడు నీలిమ వాడిని చూసి అరవబోయి వుంటుంది. అమె గొడవ చేయకుండా ఉండడం కోసం పొడిచి చంపేసి ఉంటాడు. ఆ తరువాత నగలు తీసుకుని నీలిమ శవాల్ని ఊరిచివర పడేసి వుంటాడు.'

'ఆ గుండుగాడొక్కడే ఈ పనిచేసి ఉండడు గురూగారు..... వాడికి జతగా జగ్గూగాడు కూడా వుంటాడుగా..... ఇద్దరూ కలిసే ఈ పని చేసి వుంటారు......'

'అయితే పదండి.... ఇప్పుడే పోలీసులకి చెప్దాం.....' అన్నాడు రాంబాబు.

'లాభంలేదు రాంబాబు..... వాళ్ళు నీ మాటలు నమ్మరు. నువ్వు నిర్దోషివైతే ఎందుకు మమ్మల్ని ఒకటి. దాన్ని చూసిన తరువాత నువ్వేం చెప్పినా నమ్మరు. ఇవికాక నిలిమ డైమండ్ నక్లెస్ నీ దగ్గర దొరికింది......' అంది సరోజ.

రాంబాబు మళ్ళీ రెండుచేతుల్తో తల పట్టుకున్నాడు.

'మరి గురూగారు తప్పించుకునే మార్గం ఏమిటి?'

'రాంబాబు తనా హత్య చేయలేదని నిరూపించుకోవలి అంటే ఎవరు హత్యచేశారో వాళ్ళని సాక్ష్యాలతో పట్టుకోవాలి' అంది సరోజ.

'ఎలా ?.....నేను బయటికి రావడానికే వీల్లేదే..... బయటికి అడుగుపెడితే పోలీసులు పట్టుకుంటారు......'

'అయితే మాత్రం ఏం గురూగారు..... చాలా సింపుల్ , మీరు జైల్లో పుట్టినరోజు చేస్కుంటారు' అన్నాడు కిష్టయ్య ఉత్సాహంగా.

రాంబాబు, సరోజ అయోమయంగా కిష్టయ్య వంక చుశారు.

ఆ మాత్రం అర్థంకలేదా అన్నట్టు ఇద్దరివంక జాలిగా చూశాడు కిష్టయ్య.

'జైల్లో పుట్టినరోజ పార్టీ స్వీట్సుతో మత్తుమందు కలిపి అందరికీ పంచుతాన్నామాట!..... అప్పుడు అందరూ అవితిని పడిపోతే మీరు తప్పించుకోవచ్చు చార్లెస్ శోభరాజ్‌లాగా అన్నమాట!'

రాంబాబు, సరోజ కిష్టయ్యవంక చూశారు.

'అది జరిగేపని కాదుగానీ..... ఈ విషయం గురించి మనం కాస్త ఆలోచించాలి!' అంది సరోజ.

ఇంతలో అక్కడికి శ్యామ్రావు వచ్చాడు.

'మీరు మాటిమాటికి ఇక్కడికీరావడం అంతమంచిదికాదు. రాంబాబుకి మీరు బాగా కావలసినవాళ్ళు కాబట్టి పోలీసులు మీమీద నిఘావేసి వుంచుతారు. ఎవరూ మిమ్మల్ని ఫాలో అవడంలేదనే నమ్మకం మీకు కలిగాకే ఇక్కడికి రండి..... చీకటిపడ్డాక రావడం మంచిది' అన్నాడు సరోజ, కిష్టయ్యలతో శామ్రావు.

రాంబాబుని ఆ ఉచ్చులోంచి ఎలా తప్పించాలని వాళ్ళు చాలాసేపు ఆలోచించారు. ఎంతకీ పరిష్కారం దొరకడంలేదు.

'నీలిమ శవం ఊరిచివర దొరికింది కాబట్టి హంతకుడికి సంబంధించిన ఆధారాలేమైన అక్కడ వేతకితే దొరుకుతాయేమో?' అన్నాడు శ్యామ్రావు.

రాంబాబు, కిష్టయ్య ముఖముఖాలు చూస్కున్నారు.

### బిగ్‌బాస్ బిగ్‌ప్లాన్

'హ్హాహ్హాహ్హా.....'

శక్తివంచన లేకుండా నవ్వాడు బిగ్‌బాస్.

కానీ డెన్‌లోని అందరూ మామూలుగ ఏమీ పట్టనట్టునిల్చున్నారు.

బిగ్‌బాస్ గ్లాస్ డోర్స్ వెనుకనుండి వాళ్లని ఆశ్చర్యంగా చూశాడు.

మరోసారి గొంతు సవరించుకుని గట్టిగా నవ్వాడు.

'హ్హాహ్హాహ్హా.....'

ఊహు..... డెన్‌లోని రౌడీలందరికీ చీమకుట్టినట్లయినా లేదు.

బిగ్‌బాస్‌కి అనుమానం వచ్చింది.

'హలో....హలో.......' తన ముందున్న మైకులో అన్నాడు.

జాకాల్‌గానీ, రాబర్ట్‌గానీ, జగ్గూ, వీరూగానీ ఎవరూ గ్లాస్ డోర్స్ వంక చూడలేదు.

బిగ్‌బాస్‌కి అర్థం అయ్యింది. తన ముందున్న మైకో ఆన్‌లో పెట్టి 'హలోమైకో టెస్టింగ్ ..... వన్ ....టు..... త్రీ..... ఫోర్.....' అన్నాడు.

అందరూ గ్లాస్‌డోర్స్ వెనకాల వున్న బిగ్‌బాస్ నీడవంక చూసి వినిపిస్తున్నట్లుగా తల

ఊపారు.

అప్పుడు ఓసారు ఊపిరితిత్తులనిండా పూర్తిగ గాలి పీల్చుకుని గుక్కపట్టినవ్వాడు బిగ్‌బాస్.

'ఊహు హు హో హో హ హ హ్హాహ్హాహ్హా....'

అందరూ ఆతృతగా బిగ్‌బాస్‌వంక చూశారు. బిగ్‌బాస్ అలా నవ్వాడంటే ఏదో విశేషం ఉందన్నమాటే.

'ఎందుకు బాస్ అంత కష్టపడి నవ్వారు?' జాకాల్ మృదువుగా అడిగాడు.

గోడలకి అమర్చివున్న మైక్రోఫోనుల్లోంచి జాకాల్ మాటలు బిగ్‌బాస్‌కి వినిపించాయ్.

'నే నెందుకు నవ్వానో నీకు తెలీదా?' ఆశ్చర్యంగా అడిగాడు బిగ్‌బాస్.

తెలీదన్నట్లు అడ్డంగా తలూపాడు జాకాల్.

'మీకు?' మిగతావాళ్లని చూస్తూ అడిగాడు బిగ్‌బాస్.

'వాళ్ళుకూడా అడ్డగా తలూపారు.

'ఓరి సన్నాసుల్లారా ....కోళ్ళు కుక్కలూ మింగడం తప్ప ఓపేపరు చుదువుదాం ..... ఓ న్యూస్ తెలుసుకుందాం అనే ఆలోచనే లేదే మీకు?!.......'

బిగ్‌బాస్ మాటలు వింటూనే సిగ్గుతో, అవమాన భారంతో అందరి తలలూ కిందికి వాలాయి.

బిగ్‌బాస్ ఒకసారి భారంగా నిట్టూర్చాడు. అంతలోనే అతనికి తన కర్తవ్యం గుర్తుకు వచ్చింది.